సాక్షి
అనంతపురం
సోమవారం । 7 । అక్టోబర్ । 2024



వాలీబాల్ పోటీల్లో సత్తా

తూర్పుగోదావరి జిల్లా తునిలో జరిగిన అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు ప్రతిభ చాటింది.



టమాట కిలో రూ.52

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.52 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి ధర రూ.40 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.6°/21.8°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షాలు కురిశాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు రెండు చోట్ల ఫిర్యాదుల స్వీకరణ



అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం సోమవారం రెండు చోట్ల నిర్వహించనున్నారు. కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. అనంతపురం అర్బన్, రూరల్ మండలాలకు సంబంధించి జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి సూచించారు.

పిడుగు పడి యువకుడి మృతి



శంకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి

శింగనమల: పిడుగు పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రం శింగనమలలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. శింగనమలకు చెందిన బొజ్జప్ప కుమారుడు శంకర్ (24) గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని పెద్ద కుంట అటవీ ప్రాంతంలో గొర్రెలు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో శంకర్‌పై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శింగనమల పోలీసులు శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ఉచితమే.. టన్నుకు రూ.245 కట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'ఇసుక ఉచితమే. అయితే వినియోగదారులు వివిధ చార్జీలు, లోడింగ్, 18 శాతం జీఎస్టీ, ఇతర ఫీజు, తదితర వాటిని కలుపుకుని టన్నుకు రూ.245 చెల్లించాలి. నిర్దేశించిన రవాణా చార్జీని చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఇసుక విధానం పకడ్బందీ అమలుకు చర్యలు చేపట్టాం. అక్రమాలకు పాల్పడితే చర్యలు ఉంటాయి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఇసుక పాలసీపై కలెక్టర్ ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఉన్న జుంజురాంపల్లి యార్డ్‌ను మూసివేశామన్నారు. ఈనెల 16 నుంచి జిల్లాలోని యల్లనూరు మండలం చిలమకూరు, గార్లదిన్నె మండలం ఇల్లూరు, కంబదూరు మండలం కర్తనపర్తి, బ్రహ్మసముద్రం మండలం అజ్జయదొడ్డి, కణేకల్లు మండలం రాచుమర్రి వద్ద రీచ్‌లను ప్రారంభమవుతాయన్నారు. వీటిలో 2.02 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు.

ఒకరికి రోజుకు 20 టన్నులు..

ఇసుక ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ చెప్పారు. ఒక వినియోగదారు రోజుకు 20 టన్నులు పొందవచ్చన్నారు. ఎక్కువ మొత్తం కావాలనుకునేవారు శాండ్ నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ ద్వారా కలెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇసుక అక్రమ నిల్వ, అక్రమ రవాణా, నల్లబజారులో విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమాల అడ్డుకట్టకు ప్రత్యేకంగా మండల, జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు.

ఫిర్యాదు చేయవచ్చు..

ఇసుక రవాణా, తదితర అంశాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేశామన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1800–425–6039, 08554–298380 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలియజేయవచ్చన్నారు. వాటిని జిల్లాస్థాయి ఇసుక కమిటీ పరిశీలించి పరిష్కరిస్తుందన్నారు. సమావేశంలో గనుల శాఖ డీడీ వెంకటేశ్వర్లు తదితరులుపాల్గొన్నారు.

సా..గుతోన్న రథం కథ

రామా కనవేమిరా..

జిల్లా పోలీసులకు ఎంతో మంచి పేరుండేది. ఎన్నో హత్య కేసులు స్వల్ప కాలంలో ఛేదించి, హవాలా సొమ్మును పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచి ఎంతో కీర్తి గడించారు. గత ఎన్నికలకు ముందు టీడీపీ నేత కందికుంట ప్రసాద్ వాహనంలో వెళుతున్న రూ.2 కోట్ల సొమ్మును పట్టుకుని శభాష్ అనిపించుకున్నారు. గతంలో ఎన్నో క్లిష్టమైన కేసులను సులువుగా ఛేదించిన పోలీసులు ఇప్పుడు మాత్రం కణేకల్లు మండలం హనకనహాల్ గ్రామంలో రాములోరి రథానికి నిప్పు పెట్టిన అసలైన నిందితులను పట్టుకోవడంలో విఫలమయ్యారు. సెప్టెంబర్ 23వ తేదీ రాత్రి ఈ ఘటన జరిగినా, ఇప్పటికీ నిందితులెవరో తేల్చలేదు.



హనకనహాల్‌లో దగ్ధమైన రాములోరి రథాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్ (ఫైల్)

- మలుపులు తిరుగుతున్న హనకనహాల్ కేసు
- విచారణ పేరుతో రోజుల తరబడి అమాయకులకు వేధింపులు
- వ్యవసాయ పనులు చేసుకునే రైతులను విచారణ పేరుతో అదుపులోకి
- వర్షాలు పడటంతో పొలం పనులు చేసుకుంటామంటూ బాధితుల వేడుకోలు
- అధికార పార్టీకి అంటకాగుతూ పట్టించుకోని పోలీసులు
- కేసును నీరుగార్చేలా కుట్రలు చేస్తున్నారని విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కణేకల్లు మండలం హనకనహాల్ గ్రామంలో రాములోరి రథానికి నిప్పు పెట్టిన ఘటన రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఘటన జరిగే సమయానికే టీడీపీ అధినేత చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ఊబిలో కూరుకుపోయారు. ఇంతలోనే హనకనహాల్ ఘటన జరగడంతో భక్తుల నుంచి వ్యతిరేకత వస్తుందని అంచనా వేసిన అధికార పార్టీ పెద్దలు జిల్లా పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. సీఎం కార్యాలయం నుంచే ఎస్పీకి ఫోన్ చేసి కేసును పక్కదారి పట్టించేందుకు యత్నించినట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో సంబంధం లేని వ్యక్తులు..

పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకే జిల్లా పోలీసులు నడుచుకుంటున్నట్లు సమాచారం. 14 రోజులు దాటినా నిందితులెవరో తేల్చకపోవడమే దీనికి అద్దం పడుతోంది. ఈ క్రమంలో రాయదుర్గం, కళ్యాణదుర్గం పోలీసులు హనకనహాల్ గ్రామానికి చెందిన అమాయకులను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ పేరుతో వేధిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు ఘటనతో ఎలాంటి సంబంధమూ లేదని, వర్షాలు పడటంతో పొలం పనులు చేసుకోవాల్సి ఉందని, తమను వదిలేయండని బాధితులు ప్రాధేయపడుతున్నా పోలీసులు వినడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న ఓ వ్యక్తి ఇటీవల తన కుమార్తె పెళ్లికి సంబంధించి లగ్నపత్రిక రాయించుకున్నారు. ఈ క్రమంలో తనను వదిలితే పెళ్లి పనులు చూసుకుంటానని కాళ్లావేళ్లా పడుతున్నా కనికరించడం లేదు. అసలు వాళ్లను ఎక్కడ విచారిస్తున్నారో, ఎక్కడికి తీసుకెళ్లారో కూడా తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

కేసును నీరుగార్చే కుట్ర..

రాములోరి రథం కేసును నీరుగార్చేందుకు ఈ వ్యవహారానికి రాజకీయ రంగు పులిమారని అర్థమవుతోంది. ఇప్పటివరకూ 8 మందిని అదుపులోకి తీసుకున్నా ఈశ్వరరెడ్డి అనే వ్యక్తిని మాత్రమే అరెస్టు చూపారు. మిగతా ఏడుగురిని విచారణ పేరుతో అదుపులో ఉంచుకున్నారు. ఈశ్వరరెడ్డి మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా పని చేశారు. అతని బావ రామకృష్ణారెడ్డి టీడీపీ వీరాభిమాని. ఈయన కోరిక మేరకు ఈశ్వరరెడ్డి టీడీపీకి పనిచేశారని తేలింది. అయితే స్వయానా ఎస్పీ తన ప్రెస్‌మీట్‌లో ఈశ్వరరెడ్డి వైఎస్సార్ సీపీకి చెందిన వారని చెప్పి కేసుకు రాజకీయ రంగు పులిమారు. రథానికి నిప్పు పెట్టింది టీడీపీ నాయకులే అని గ్రామస్తులు ఇప్పటికీ బాహాటంగా చెబుతున్నా.. అధికార పార్టీ ఒత్తిళ్లతో కేసును నీరుగార్చి అమాయకులతో బలవంతంగా నేరం ఒప్పించే కుట్ర జరుగుతోందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

త్వరలో ఫైనలైజ్ చేస్తారట..!

కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబును ఈ కేసు విషయమై 'సాక్షి' వివరణ కోరగా ఆయన చాలా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. 'చేస్తున్నాం, చూస్తున్నాం, విచారిస్తున్నాం.. త్వరలోనే నిందితులను ఫైనలైజ్ చేస్తాం' అన్నారు. త్వరలోనే పట్టుకుంటాం అనకుండా ఫైనలైజ్ చేస్తాం అన్న డీఎస్పీ మాటలు వింటుంటే వీళ్లే నిందితులను నిర్ణయించే పరిస్థితి కనిపిస్తోంది.

విస్తృతంగా 'విజిబుల్ పోలీసింగ్'



అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను సీజ్ చేస్తున్న అనంతపురం వన్‌టౌన్ పోలీసులు

అనంతపురం: ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు ఆదివారం జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. వాహనాల తనిఖీలు చేపట్టారు. మట్కా, అక్రమ మద్యం, తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారి ఇళ్లపై దాడులు నిర్వహించారు. రోడ్డు భద్రతా ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశారు.

రూ.70 వేల విలువ చేసే టపాసులు సీజ్..

తనిఖీల్లో భాగంగా అనంతపురం వన్ టౌన్ పోలీసులు తిలక్‌రోడ్డులోని ఓ దుకాణంపై దాడులు నిర్వహించి రూ.70 వేల విలువ చేసే అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులు సీజ్ చేశారు. గుత్తి పోలీసులు మట్కా బీటర్లను అరెస్ట్ చేసి రూ.27,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌ను ఆయా పోలీసు స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ చేపట్టారు. పాత పంథా వదిలి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారితో పాటు ట్రిబుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్, డ్రంకన్ డ్రైవింగ్, తదితర రోడ్డు భద్రత ఉల్లంఘనదారులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానా విధించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించారు.

హిందుత్వం పేరుతో జాతి విచ్ఛిన్నానికి కుట్ర

- డీసీఎం రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలి
- సనాతన ధర్మం పేరిట రాజకీయాలు వద్దు
- గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: హిందుత్వం పేరుతో జాతిని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ పురందేశ్వరి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మండిపడ్డారు. ఇందులో భాగంగానే భక్తులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్ అర్థరహిత ఆరోపణలు చేశారన్నారు. ముఖ్యంగా డీసీఎం మరో అడుగు ముందుకేసి సనాతన ధర్మం పేరుతో హిందువులను రెచ్చగొట్టేలా ప్రవర్తించారని విమర్శించారు. తిరుమల లడ్డూపై రాజకీయం చేయడం తగదని, ఆయన రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. ఆదివారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అధికారం చేపట్టిన తర్వాత కూటమి పెద్దలు నెరవేర్చలేదన్నారు. కేంద్రంతో అంటగాగుతున్న టీడీపీ, జనసేన పార్టీ ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు, పోలవరం, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పురోగతిని పూర్తిగా పక్కన పెట్టాయన్నారు. వారి పాలనా వైఫల్యాలపై ప్రజలు దృష్టి సారించకుండా ఉండేందుకు చివరకు దేవుడి ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమలకు వెళ్లాలంటే సనాతన ధర్మం అంగీకరించదనే ధోరణిలో మాట్లాడడం సరికాదన్నారు. మత ప్రసక్తి లేని లౌకిక తత్వానికి కట్టుబడి ఉండాలని ప్రబోధించే సనాతన ధర్మానికి తూట్లు పొడిచారని మండిపడ్డారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఎన్నో ధార్మిక పీఠాలున్నాయని, ప్రత్యేకంగా రాజకీయ నేతలు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ అప్పట్లో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన డిప్యూటీ సీఎంగా ఉన్న ఈ రాష్ట్రంలోనే ఇప్పటికే అదృశ్యమైన మహిళల గురించి సమగ్ర విచారణకు ఎందుకు ఆదేశించలేదో చెప్పాలన్నారు. ఆయన వ్యాఖ్యల్లో నిజం లేదు కాబట్టే మౌనంగా ఉండిపోయారని పేర్కొన్నారు. ముచ్చుమర్రి, పుంగనూరులో జరిగిన హత్యాచారాలపై కూటమి సర్కార్ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో చెప్పాలన్నారు. అస్తమానం అబద్ధాలు ఆడే హోంమంత్రి కానీ, డీసీఎం పవన్‌కళ్యాణ్ కానీ బాధిత కుటుంబాలను పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో కూటమి పెద్దలకు తప్పక బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నసనకోట ముత్యాలు, కుంటిమద్ది రమేష్ తదితరులు పాల్గొన్నారు.





అనంతపురంలోని కొత్తూరులో లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణ, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాహిమాం.. పరాశక్తీ

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిని దర్శించుకుని భక్తులు పరవశించిపోయారు. కదిరిలో ఖాద్రీ లక్ష్మినరసింహస్వామి రామావతారంలో భక్తులను కటాక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



రామావతార అలంకారంలో ఖాద్రీశుడు

ఇన్‌పుట్‌లోనూ రైతుకు మోసం

- ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు రూ.12 కోట్లకు పైగా పంట నష్టం
- తాజాగా రూ.1.48 కోట్లతో నివేదిక పంపిన వ్యవసాయ, ఉద్యానశాఖ



ఆగస్టు మూడో వారంలో కళ్యాణదుర్గం మండలంలో వర్షాలకు దెబ్బతిన్న టమాట పంటను పరిశీలిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం అగ్రికల్చర్: ఆగస్టు రెండు, మూడు వారాల్లో కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.12 కోట్లకు పైచిలుకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు అప్పట్లో ప్రాథమికంగా అంచనాలు వేశారు. అయితే వ్యవసాయ, ఉద్యాన పంటల రైతులకు రూ.1.48 కోట్లు మేర నష్టం జరిగినట్లు ఇటీవల ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రాథమిక నష్టం అంచనాలకు కాస్త అటూఇటుగా ఉండాల్సిన నివేదికలు పూర్తిగా తారుమారు కావడంతో అన్యాయం జరిగే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

అధికారుల తీరుపై విమర్శలు..


ప్రకృతి విపత్తుల విభాగం నిబంధనల పేరుతో కొర్రీలు వేయడం పట్ల ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో రైతులకు చిల్లర విదిలించే పరిస్థితి. వ్యవసాయ పంటలకు సంబంధించి 22 మండలాలు, 80 గ్రామాల పరిధిలో కంది, వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, వరి, ఆముదం, మినుము, సోయాబీన్, కొర్ర, సజ్జ, పొద్దుతిరుగుడు తదితర పంటలు 1,750 హెక్టార్లలో దెబ్బతినడంతో 2,100 మంది రైతులకు రూ.6 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అప్పట్లో అంచనా వేసింది.

- తాజాగా ప్రభుత్వానికి పంపిన ఇన్‌పుట్ నివేదికలో 579 మంది రైతులకు చెందిన 466.95 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో రూ.89.76 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ఇందులో వేరుశనగ, కంది మినహా మిగతా ఏడు పంటలు నామమాత్రంగా చూపించారు. అంటే 1,520 మంది రైతులను, 1,284 హెక్టార్లు తగ్గిస్తూ రూ.5 కోట్లకు పైగా ఇన్‌పుట్ కోత పడేలా చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ఉద్యానశాఖ పరిధిలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, పుట్లూరు, తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి, పామిడి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప, ఉరవకొండ, కూడేరు, వజ్రకరూరు, గార్లదిన్నె, అనంతపురం, ఆత్మకూరు, రాప్తాడు మండలాల పరిధిలో 150 గ్రామాల్లో 320 హెక్టార్లలో నష్టం జరిగింది. టమాట, బీన్స్, బీర, దోస, కళింగర, కర్బూజా, గుమ్మడి, ఉల్లి, బొప్పాయి, బెండ, చీనీ తదితర పంటలు దెబ్బతినడంతో 430 మంది రైతులకు రూ.6 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.
- తాజాగా ప్రభుత్వానికి అందించిన నివేదికలో 286 మందికి చెందిన 223 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో రూ.58.81 లక్షల నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. ఇందులో టమాట, మిరప, కూరగాయలు పంటలు మినహా మిగతా ఏ పంటను పరిగణనలోకి తీసుకోలేదు. ఇక్కడ కూడా 144 మంది రైతులు తగ్గిపోయారు. 100 హెక్టార్లు మేర తగ్గిపోయింది. రూ.5 కోట్ల వరకు ఇన్‌పుట్‌కు కోత పడేలా నివేదించారు.

వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం ప్రారంభం



వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ప్రశాంతి నిలయం: ఆధ్యాత్మిక కేంద్రం ప్రశాంతి నిలయంలో దసరా వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వేడుకలలో భాగంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం నిర్వహించారు. ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించిన పండితులు కలశాలలో వేదమంత్రోచ్చారణ నడుమ పూర్ణచంద్ర ఆడిటోరియానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన యజ్ఞ వేదిక వద్ద క్రతువులు ప్రారంభించారు. రుద్రహోమం చేపట్టి దేవీ, రామాయణ, భాగవత పారాయణాలు పఠించారు. కుంకుమార్చన, మహాలక్ష్మి పూజ, దేవీ మహత్యం, సూర్యనమస్కారం, సహస్ర లింగపూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు యజ్ఞంలో పాల్గొని తరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు వేద పండితులకు వస్త్రదానం చేశారు. సాయంత్రం ప్రశాంతి విద్వాన్ మహాసభ నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థల నందిగిరి క్యాంపస్‌కు చెందిన గణిత విభాగం ఆచార్యులు డాక్టర్ వి.భాస్కరన్ వేడుకలనుద్దేశించి ప్రసంగించారు. నందిగిరి క్యాంపస్ విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించారు.

క్లుప్తంగా

దరఖాస్తుదారుడే రావాలని లేదు

అనంతపురం: మద్యం దుకాణాల టెండర్లకు సంబంధించి లాటరీ సమయంలో దరఖాస్తుదారులకు సడలింపునిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ ఆదివారం వెల్లడించారు. లాటరీ సమయంలో దరఖాస్తుదారుడు నేరుగా హాజరు కాలేని పరిస్థితుల్లో ఆయన తరఫున అనుమతి పొందిన వ్యక్తిని అనుమతిస్తారు. ఇందుకు సంబంధించి అనుమతి పత్రాన్ని చూపించాల్సి ఉంటుంది.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



గెలుపొందిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: క్రీడలతో మానసిక, శారీరక వికాసం పెంపొందుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జీవీ వెంకటస్వామి అన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలోని పీటీసీ మైదానంలో క్రికెట్ టోర్నీ జరిగింది. మొత్తం 8 జట్లు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై కణేకల్లు జట్టు విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి ఆ శాఖ జేడీ డాక్టర్ జీవీ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు మరిన్ని జరుపుకోవాలని, శాఖా పరంగా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏజీఎస్‌జేఏ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ చంద్రమోహన్, ఏహెచ్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీ - గుర్తు తెలియని వ్యక్తి మృతి



సోమందేపల్లి: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లిలోని నల్లగొండ్రాయనపల్లి క్రాస్ సమీపంలో ఆదివారం ఉదయం నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తి (45)ని ఓ వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూసుకెళ్లిపోయాడు. ఘటనలో గాయపడి రోడ్డు పక్కన కూర్చొన్న వ్యక్తిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించి వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స ప్రారంభించేలోపు ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడి ఆచూకీ తెలిసిన వారు సోమందేపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

మత్స్య సంపద వృద్ధి



చెరువుల్లో వదలడానికి సిద్ధమైన చేప పిల్లలు



బీటీపీ మత్స్యక్షేత్రం

- 2.50 కోట్ల చేప పిల్లలను పెంచుతున్న అధికారులు
- నవంబర్ 28లోపు రిజర్వాయర్లు, చెరువుల్లో విడుదల

రాయదుర్గం: జిల్లాలో మత్స్య సంపద క్రమంగా పెరుగుతోంది. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి గాను బీటీపీ, అనంతపురం, పీఏబీఆర్, పెనకచెర్ల వద్ద ఉన్న మత్స్యక్షేత్రాల్లో 2.50 కోట్ల చేప పిల్లలను అధికారులు పెంచుతున్నారు. 35 రోజుల క్రితం ఆయా క్షేత్రాల్లో వదిలిన మూడు రోజుల వయసున్న చేప పిల్లలు.. ప్రస్తుతం ఒకటిన్నర ఇంచు వరకూ ఎదిగాయి. ఇవి కాస్త మూడు ఇంచులకు ఎదిగి ఆరోగ్యంగా ఉంటే ఉమ్మడి జిల్లాల్లోని పలు రిజర్వాయర్లు, చెరువుల్లో వదిలేలా అధికారులు కార్యాచరణను సిద్ధం చేశారు.

లైసెన్స్ రిజర్వాయర్లలో ఉచితంగా...

జిల్లాలోని బీటీపీలో 35 లక్షలు, అనంతపురంలో 55 లక్షలు, పెనకచెర్లలో 80 లక్షలు, పీఏబీఆర్ వద్ద 80 లక్షలు చొప్పున కట్ల, రోహు, మృగ్యాల జాతులకు చెందిన చేపల సీడ్ (స్పాన్) ఉత్పత్తి జరుగుతోంది. అనంతరం వీటిని ఉమ్మడి జిల్లాలో లైసెన్స్ పొందిన బీటీపీ, పీఏబీఆర్, పేరూరు (అప్పర్ పెన్నార్ రిజర్వాయర్)లో వంద శాతం రాయితీలో విడుదల చేస్తారు. మిగిలిన వాటిని మత్స్య సహకార సంఘాలకు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు విక్రయిస్తారు. అప్పటికీ మిగిలితే అన్నమయ్య జిల్లాలోని లైసెన్స్ రిజర్వాయర్లు, శ్రీశైలం బ్యాక్ వాటర్, వెలుగొండ ప్రాజెక్ట్‌లో వదిలేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఆగస్టులోనే అనువైన కాలం

చేప పిల్లలు పెంచి ఉత్పత్తి చేసేందుకు జూన్ నుంచి ఆగస్టు 15 వరకు అనువైన కాలం. రిజర్వాయర్లు, చెరువుల్లోకి అప్పుడప్పుడే కొత్త నీరు వచ్చి చేరుతూ ఉంటుంది. దీంతో చేప పొదుగు (హేచింగ్), చిప్పర పిల్లలను (రేరింగ్) సాకడానికి నర్సరీలను సిద్ధం చేస్తుంటారు. అయితే వర్షాభావ పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్న జిల్లాలో ఇప్పటి వరకూ కేవలం హెచ్చెల్సీ నీటిపై ఆధార పడి చేపపిల్లల ఉత్పత్తిని చేపడుతున్నారు. హెచ్చెల్సీకి నీటి విడుదల ఆలస్యమైతే చేప పిల్లల పెంపకంలోనూ జాప్యం చోటు చేసుకుంటోంది.

ఈ ఆలస్యాన్ని భరించలేక మత్స్య సంఘాలు ఇతర ప్రాంతాల్లో అధిక ధరకు చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో వదులుకోవాల్సి వస్తోంది. మత్స్యక్షేత్రాల వద్ద తగిన నీటి వసతి ఏర్పాటు చేసుకుని ముందే ఉత్పత్తి లక్ష్యం ప్రారంభిస్తే మత్స్యకారులకు మేలు జరుగుతుందని మత్స్యకార సంఘాల నాయకులు అంటున్నారు.

వచ్చే నెల ఆఖర్లో రిజర్వాయర్లకు



జిల్లాలోని పలు మత్స్యక్షేత్రాల్లో సుమారు 2.50 కోట్ల చేప పిల్లలు పెంచుతున్నాం. ఇందులో 30 లక్షలకు తగ్గకుండా నాణ్యమైన దిగుబడి సాధిస్తాం. లైసెన్స్ రిజర్వాయర్లలో వంద శాతం రాయితీతో విడుదల చేస్తాం. ఆ తర్వాత మత్స్యకార సంఘాల అవసరాల మేరకు సరఫరా చేస్తాం. మిగిలిన వాటిని అన్నమయ్య జిల్లాకు ఇక్కడి నుంచే అందిస్తాం. నవంబర్‌లోనే చేప పిల్లలు విడుదల ప్రక్రియ కొనసాగుతుంది. కట్ల, రోహు, మృగ్యాల జాతులు ఎక్కువగా పెంచాం.

– లక్ష్మీనారాయణ, ఎఫ్‌డీఓ, బీటీపీ

అదుపు తప్పిన '108'

బెళుగుప్ప: స్థానిక పీహెచ్‌సీకి కేటాయించిన 108 అంబులెన్స్ ఆదివారం కళ్యాణదుర్గం వెళుతూ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. స్థానిక పీహెచ్‌సీకి వచ్చే అత్యవసర కేసులను రెఫర్ చేయడానికి ప్రభుత్వం కేటాయించిన 108 వాహనం పూర్తిగా దెబ్బతింది. పైలెట్ అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు చిన్నపాటి మరమ్మతులు చేయిస్తున్నాడు. ఆదివారం ఉదయాన్నే కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి రోగిని తీసుకెళుతుండగా... మార్గం మధ్యలో ముందు టైరు ఊడి పక్కనే మట్టికుప్పలోకి దూసుకెళ్లింది. విషయంపై పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్‌రెడ్డిని మాట్లాడుతూ... గతంలో రెండు నెలల పాటు మరమ్మతులకు వదలినా ప్రయోజనం లేకుండా పోయిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

గార్లదిన్నె: మండలంలోని శిరివరం గ్రామానికి చెందిన యువతి శ్రావణి కనిపించడం లేదని ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమార్తె సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లక్ష్యం కాలేదని యువతి తండ్రి సుంకన్న చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పెరుగుతున్న ఫెడ్ ఎక్స్ మోసాలు

- అప్రమత్తంగా ఉండాలన్న ఎస్పీ పి.జగదీష్



అనంతపురం: ఫెడ్‌ఎక్స్ కొరియర్ సర్వీస్ పేరిట జరుగుతున్న సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని జిల్లా ప్రజలకు ఎస్పీ పి.జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఫెడ్‌ఎక్స్ కొరియర్ సర్వీస్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

భయపెట్టి.. దోచుకుని

ఫెడ్ ఎక్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు చేసే మోసాలను ఎస్పీ వివరించారు. తొలుత అపరిచితుల నుంచి సెల్‌ఫోన్‌కు కాల్ వస్తుంది. అవతలి వ్యక్తి తాను విదేశాల నుంచి మాట్లాడుతున్నానని నమ్మబలికి అకట్టుకుని కాల్ కట్ చేస్తాడు. ఆ తర్వాత మరో అపరిచిత నంబర్ నుంచి కాల్ వస్తుంది. తాను ఫెడ్ ఎక్స్ కొరియర్ సర్వీస్ నుంచి కాల్ చేస్తున్నానని పరిచయం చేసుకుంటాడు. మీ పేరు మీద పార్సిల్ వచ్చిందంటాడు. మాకు కొరియర్ రావాల్సిన వస్తువేలేమీ లేవని మీరు తెలిపినా... అవతలి వ్యక్తి వినకుండా మీ పేరు, ఫోన్ నంబర్ తెలిపి కొరియర్‌లో డ్రగ్స్ ఉన్నాయనో.. పేలుడు పదార్థాలు ఉన్నాయనో చెప్పి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ భయభ్రాంతులకు గురి చేస్తారు. అదే సమయంలో మీ ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలను మీ ద్వారానే తెలుసుకుని ముంబయి పోలీసులకు మీపై ఫిర్యాదు చేస్తున్నామని చెప్పి ఫోన్ కట్ చేస్తాడు. ఆ తర్వాత ముంబయి సైబర్ క్రైమ్ పోలీస్ విభాగం నుంచి ఫోన్ చేస్తున్నామని మరో వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వస్తుంది. మిమ్మల్ని ఓ హోటల్ రూం లేదా, ఇంట్లోనే ఓ గదిలో ఒంటరిగా ఉంటే విచారణ చేపడతామని నమ్మిస్తాడు. అనంతరం స్కైప్ కాల్‌లో మాట్లాడుతూ... మీ వ్యక్తిగత సమాచారం మొత్తం లాగేసుకుంటాడు. ఆ తర్వాత ఫైన్ కట్టాలని మోసగించి మొత్తం డబ్బును తన అకౌంట్‌కు బదిలీ చేయించుకుంటాడు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నిజంగా మీ మీద ఏదైనా పోలీస్ కేసు ఉంటే సంబంధిత పోలీస్ అధికారి నేరుగా వచ్చి మాట్లాడుతారు. వాట్సాప్ కాల్, స్కైప్, వీడియో కాల్ అంటూ ఎవరూ చేయరు. అలా చేస్తే వారు సైబర్ నేరగాళ్లు అని అర్థం చేసుకోవాలి.
- ఇలాంటి మోసపూరిత కాల్స్ వస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి. లేదా కనీసం కుటుంబసభ్యులతో విషయాన్ని పంచుకోవాలి.
- వాట్సాప్‌లో మీ, కుటుంబసభ్యుల ఫొటోలను ప్రొఫైల్‌గా పెట్టకపోవడం మంచిది.
- అలాగే వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదు.
- మీకు తెలియని వ్యక్తి ఫోన్‌లో పరిచయమై రిక్వెస్ట్ పెడితే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు.
- మీ వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో గోప్యంగా ఉంచాలి.
- బహుమతులు గెలుచుకున్నారు అని వచ్చే ఈ–మెయిల్ మెసేజ్‌పై స్పందించరాదు.
- మీరు, కుటుంబసభ్యులు ఎక్కడికైనా వెళ్లినప్పుడు మీ పర్సనల్ డేటాను ఫోన్‌లో అనవసరంగా పొందుపరచరాదు.
- సైబర్ నేరాల బారిన పడిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930 లేదా, www. cybercrime. gov. in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.

తాగునీటి కార్మికులకు పండగ పూటా పస్తులేనా?

- సమ్మెలో ఉన్న కార్మికులపై కాంట్రాక్టర్ బెదిరింపులకు దిగడం సరికాదు
- కలెక్టర్ ఇచ్చిన మాట ప్రకారం పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



మాట్లాడుతున్న ఓబులు

కూడేరు: పెండింగ్‌లో ఉన్న 8 నెలల వేతనాలు చెల్లించకపోతే శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మిక కుటుంబాలు దసరా పండగపూట పస్తులుండాల్సి వస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన కూడేరు మండలంలోని పీఏబీఆర్ వద్ద ఉన్న శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పెండింగ్ వేతనాల కోసం గత నెల 5 నుంచి కార్మికులు సమ్మెలోకి వెళితే అదే నెల 17న కలెక్టర్ వినోద్ కుమార్ నాలుగైదు రోజుల్లో వేతనాలందిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. దీంతో కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరారన్నారు. అయితే ఇచ్చిన హామీని కలెక్టర్ సైతం నెరవేర్చకపోవడంతో గత నెల 30 నుంచి మరోసారి కార్మికులు సమ్మె బాట పట్టారన్నారు. పస్తులతో బతుకీడుస్తున్న కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించకపోగా సూపర్‌వైజర్ల ద్వారా కాంట్రాక్టర్ బెదిరింపులకు దిగడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోతే కాంట్రాక్టర్ ప్రత్యక్ష పోరాటానికి దిగితే కార్మికులు, తామూ మద్దతుగా నిలుస్తామన్నారు. అలా కాకుండా కార్మికులను బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇచ్చిన మాట ప్రకారం పెండింగ్ వేతనాలు, పీఎఫ్ చెల్లింపులకు కలెక్టర్ కృషి చేసి మాట నిలుపుకోవాలని కోరారు. లేదంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, కార్యదర్శి నాగేంద్ర, నగర కార్యదర్శి వెంకటనారాయణ, భవన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ముత్యాలరెడ్డి హోటల్‌లో మహిళపై అనుచిత ప్రవర్తన

అనంతపురం: నగరంలోని విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఉన్న ముత్యాలరెడ్డి హోటల్‌లో టిఫిన్ కోసం వెళ్లిన ఆర్మీ ఉద్యోగి భార్యపై అక్కడి సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారు. దీంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు... నగరంలోని సెవెన్‌హిల్స్ కాలనీలో నివాసముంటున్న ఆర్మీ ఉద్యోగి భార్య తన ఇద్దరు పిల్లలతో కలసి ఆదివారం సాయంత్రం ముత్యాలరెడ్డి హోటల్‌కు వెళ్లి ఓ పూరి, దోశ ఆర్డర్ ఇచ్చింది. అదే సమయంలో అక్కడ పని చేస్తున్న వెంకటేష్ కల్పించుకుని ఓ పూరి సరిపోతుందా? రెండు తినండంటూ ప్లేట్‌లోకి వేశాడు. అయితే ఆర్డర్ ఇచ్చింది ఒక్కటేనంటూ ఆమె తిరస్కరించడంతో 'ఏం పర్వాలేదు. నీవు నా తాలూకా. బిల్లు కట్టాల్సిన పని లేదు' అంటూ అందరూ చూస్తుండగా ఏకవచనంతో సంబోధించాడు. దీంతో బాధిత మహిళ 'మీ ఇంట్లో ఆడవారిని ఎవరైనా ఇలాగే మాట్లాడినా.. తప్పుగా వ్యవహరించినా సరిపోతుందా? ఇలా మాట్లాడడం సరి కాదు' అని వారించింది. ఆ సమయంలో ఆ వ్యక్తి మరింత రెచ్చిపోయి ప్రవర్తించడంతో ఆమె బోరున విలపిస్తూ తన భర్త ఆర్మీలో పని చేస్తున్నారని, దేశం కోసం పని చేసే వారి కుటుంబం పట్ల ఇలాగేనా ప్రవర్తించేదంటూ తిట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం బాధిత మహిళ కుటుంబసభ్యులు ముత్యాల రెడ్డి హోటల్ నిర్వాహకులను నిలదీస్తే.. అక్కడ పని చేస్తున్న సిబ్బంది అసభ్యంగా ప్రవర్తించిన మాట వాస్తవమేనని, ఈ అంశంలో తామేమీ చేయలేమని అన్నారు. దీంతో బాధిత మహిళ న్యాయం కోరుతూ అనంతపురం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మామిడిలో యాజమాన్యం

- ఉద్యాన అధికారి చంద్రశేఖర్ సూచనలు



అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో మామిడిలో మంచి దిగుబడుల కోసం మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు ఉద్యానశాఖ శ్రీసత్యసాయి జిల్లా అధికారి జి.చంద్రశేఖర్ సూచించారు. భూసారం పెంచుకోవడంతో పాటు ఈ సమయంలో ఆశించే చీడపీడల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొత్త చిగురు తొడిగే దశలో ఉన్నందున వర్షాల కారణంగా మచ్చకొమ్మ తెగులు, మచ్చ బూడిద తెగులు సోకే అవకాశం ఉందన్నారు. అలాగే డిసెంబర్, జనవరిలో తేనే మంచు పురుగు ఆశించే పరిస్థితి ఉంటుందన్నారు. వీటన్నింటికీ చేపట్టాల్సిన ముందస్తు నివారణ చర్యలను ఆయన వివరించారు.

- భూమిలో ఆర్గానిక్ కర్బన్ శాతం చాలా తక్కువగా ఉన్నందున రసాయన ఎరువుల వాడకం అధికంగా ఉంది. రసాయన ఎరువులను తగ్గించి వాటి స్థానంలో పశువుల ఎరువు, వర్మీకంపోస్టు లాంటివి వాడాలి. వర్షాలు కురుస్తున్నందున ఉలవ, పిల్లిపెసర, జనుము, జీలుగ లాంటి పచ్చిరొట్ట ఎరువుల (గ్రీన్ మెన్యూర్స్) కోసం తోటలో చెట్ల మధ్య చల్లుకుని పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నితే భూమి సారవంతమవుతుంది. దీని వల్ల మామిడిలో నాణ్యమైన దిగుబడులు వస్తాయి. ఎకరాకు 10 నుంచి 15 కిలోల చొప్పున పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు చల్లుకోవాలి.
- తోటలకు ఆశించే చీడపీడల నివారణకు లీటర్ నీటికి 7 గ్రాముల 13–0–45 + 2.5 మి.లీ క్లోరోపైరిఫాస్ + 2 మి.లీ హెక్సాకొనజోల్ కలిపి పిచికారీ చేయాలి. మళ్లీ 10 రోజుల తర్వాత లీటర్ నీటికి 0.5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ + 2 గ్రాములు ఆగ్రోమిన్ మ్యాక్స్ + 3 గ్రాములు సాఫ్ కలిపి పిచికారీ చేయాలి. తర్వాత 10 రోజులకు లీటర్ నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ + 2 గ్రాములు సల్ఫర్ కలిపి పిచికారీ చేసుకుంటే మామిడిలో మంచి దిగుబడులు వస్తాయి.

రాష్ట్రంలో అరాచక పాలన

- మహిళలపై ఆగని అకృత్యాలు
- శాంతిభద్రతల పరిరక్షణలో హోంమంత్రి అనిత విఫలం
- మేయర్ వసీం



మాట్లాడుతున్న నగర మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మహిళలు, చిన్నారులపై హత్యలు, అత్యాచారాలు, దాడులు అధికమయ్యాయని, మహిళా హోంమంత్రి ఉన్నా అరాచకాలను అడ్డుకోవడంలో విఫలమయ్యారని అనంతపురం నగర మేయర్ వసీం ధ్వజమెత్తారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో ఏడేళ్ల పాపను కిడ్నాప్ చేసి కిరాతకంగా హత్య చేసిన ఘటన ఎంతో బాధాకరమన్నారు. చిన్నారి అదృశ్యమైన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే మన మధ్య ఉండేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తెలుగు మహిళా అధ్యక్షురాలిగా అనితమ్మ ఆ రోజుల్లో ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా దానికి రాజకీయ రంగు పులిమి రాద్ధాంతం చేసేవారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆమెనే హోంమంత్రిగా ఉండి కూడా జరుగుతున్న దారుణాలపై కనీసం నోరు కూడా మెదపడం లేదని మండిపడ్డారు. ముచ్చుమర్రిలో మూడు నెలల క్రితం ఓ చిన్నారిని హత్య చేసిన కేసులో ఇప్పటికీ మృతదేహం ఆచూకీని పోలీసులు గుర్తించలేకపోతున్నారంటే పాలనలో హోంమంత్రి ఎంత ఘోరంగా విఫలమైందో అర్థం చేసుకోవచ్చునన్నారు. మహిళల హాస్టల్ బాత్ రూంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారంటూ 300 మంది విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేయడం, హోంమంత్రి సొంత నియోజకవర్గంలో యువతిపై చోటు చేసుకున్న ఆకృత్యాల్లో దోషులను కఠినంగా శిక్షించడంలోనూ మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. తిరుపతిలోనే మూడు రోజుల పాటు ఉన్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సైతం పుంగనూరు వైపు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. పుంగనూరు ఘటనపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి వెళ్తే ఊరంతా తరలి వచ్చి సంఘీభావం తెలిపాకగాని కూటమి పెద్దలకు కనువిప్పు కలగలేదన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా, మైనార్టీ నాయకులు ఉన్నా బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న నేతగా చెప్పుకునే సీఎం చంద్రబాబు సైతం ఇలాంటి దారుణాలపై ఎందుకు స్పందించడం లేదో చెప్పాలన్నారు. ఈ నెల 9న పుంగనూరుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళుతున్న విషయం తెలుసుకుని హోంమంత్రి పరుగులు తీస్తున్నారని విమర్శించారు. సమావేశంలో కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, హసీనా బేగం, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ బలవన్మరణం



రహంతుల్లా (ఫైల్)

గుంతకల్లు రూరల్: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి పెంచుకున్న ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఆయన మృతిపై అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. వివరాలు.. గుంతకల్లులోని 6–అడుగుల రోడ్డు బ్యాంక్ కాలనీలో నివాసముంటున్న రహంతుల్లా (55)కు భార్య పవిద, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రహంతుల్లాకు ఏడాది క్రితం పక్షవాతం సోకి కుడి కాలు, కుడి చెయ్యి పనిచేయకుండా పోయాయి. అప్పటి నుంచి ఆయన సిక్ లీవ్‌లోనే ఉన్నారు. చికిత్స కోసం పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగిన నయం కాలేదు. ఊత కర్రలేనిదే అడుగు కూడా వేయలేని రహంతుల్లా... తాను ఉద్యోగం చేయకపోతే కుటుంబ పరిస్థితి ఏమిటనే ఆలోచనల్లో పడి మానసికంగా కుదేలయ్యారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వాకింగ్ వెళ్లిచస్తానంటూ ఇంట్లో చెప్పి ఊత కర్ర సాయంతో బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. పాతకొత్తచెరువు గ్రామ చెరువు పక్కన గది వద్ద నైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం ఉదయం స్థానికులు గురించి సమాచారం ఇవ్వడంతో గుంతకల్లు రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని రహంతుల్లాగా కుటుంబసభ్యులు సైతం నిర్ధారిస్తూ బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సరిగా నడవడం కూడా చేతకాని రహంతుల్లా పాత కొత్తచెరువు గ్రామం వరకూ ఎలా వెళ్లాడు. రోడ్డుకు కిలోమీటర్‌కు పైగా దూరంగా ఉన్న చెరువు వద్దకు ఎలా చేరుకున్నాడనేది యక్ష ప్రశ్నగానే మిగిలింది. కాలు, చెయ్యి సరిగా పనిచేయని వ్యక్తి అంతదూరం వెళ్లి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలూ వినవస్తున్నాయి.

ఇద్దరు బ్రహ్మకుమారీల దుర్మరణం

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు
- డ్రైవర్ సహా ఆరుగురికి తీవ్ర గాయాలు



మృతులు సరస్వతమ్మ, నారాయణమ్మ

లేపాక్షి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బ్రహ్మకుమారీలు దుర్మరణం చెందారు. ఇదే ప్రమాదంలో డ్రైవర్ సహా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. చోళసముద్రం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. లేపాక్షిలోని బ్రహ్మకుమారీ – ఓం శాంతి సభ్యులు ఏడుగురు ఓ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఆదివారం మడకశిరకు కారులో బయలుదేరారు. కార్యక్రమం ముగించుకుని సాయంత్రం తిరుగు పయనమయ్యారు. చోళసముద్రం జాతీయ రహదారి సర్కిల్‌లో కుంగిన రోడ్డుపై వేగం అదుపుకాక కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బ్రహ్మకుమారీలు బిసలమానేపల్లికి చెందిన సరస్వతమ్మ (57), చిలమత్తూరు మండలం చినగానపల్లికి చెందిన నారాయణమ్మ (65) అక్కడికక్కడే మృతి చెందారు. లేపాక్షికి చెందిన అంజినప్ప, శశాంక్, ఇ.సరస్వతమ్మ, బిసలమానేపల్లికి చెందిన నారాయణమ్మ, లక్ష్మమ్మ, కర్ణాటకలోని నగరిగెరకు చెందిన రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హైవే వాహనం ద్వారా హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో నారాయణమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం బెంగళూరు ఆస్పత్రికి పంపినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుస్తీ పోటీల్లో బంగారు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

అనంతపురం: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కుస్తీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. కృష్ణా జిల్లా నున్నా గ్రామంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో బి. శాంతు (బంగారు పతకం, 86 కేజీల కేటగిరి) బి. యశ్వంత్ (బంగారు పతకం, 97 కేజీల కేటగిరి), వై. రంగస్వామి ఆచారి (బంగారు పతకం , 125 కేజీల కేటగిరి), ఎస్.మహమ్మద్ దావూద్ (కాంస్య పతకం, 61 కేజీలు), కే. గురుప్రసాద్ (కాంస్య పతకం, 97 కేజీలు) సత్తా చాటారు. బాలికల విభాగంలో సాకే స్పందన (65 కేజీలు, రజతం), బి. మానస (76 కేజీలు, రజతం) పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను శాప్ కుస్తీ కోచ్ రాఘవేంద్ర, కేజీబీవీ పీఈటీ జ్యోతి (టీం మేనేజర్), పీఈటీ నరసింహులు, వడ్డే సాయి కుమార్, కుళ్లాయప్ప అభినందించారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, వైరును చోరీ చేసిన దృశ్యం

రాప్తాడు: మండలంలోని పాలచెర్ల గ్రామం వద్ద రైతుల పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగి వైర్, ఆయిల్ చోరీ చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలచెర్ల గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, మల్లేష్, రాజు అనే రైతులు ముగ్గురు కలిసి తమ పొలాల సమీపంలో 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఎర్రిస్వామి 5 ఎకరాల్లో వేరుశనగ, మల్లేష్ 5 ఎకరాల్లో వేరుశనగ, రాజు 3 ఎకరాల్లో టమాట పంటను సాగు చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలాల దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, రాగి వైర్ ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన వారిని అరెస్ట్ చేసి న్యాయం చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జిల్లా ఆటో డ్రైవర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక





అధ్యక్షుడు సిరాజు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: జిల్లా ఆటో డ్రైవర్ల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా సిరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎ.మల్లికార్జున, ఉప ప్రధాన కార్యదర్శిగా కృష్ణనాయక్, కోశాధికారిగా గుంటూరు సురేష్ బాబు, ఉపాధ్యక్షులుగా నాగరాజు, బి.నాగరాజు, గోవిందు, సహాయ కార్యదర్శులుగా నాగేంద్ర, దుర్గాప్రసాద్, రమేష్‌ను ఎన్నుకున్నారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

అలరించిన 'భక్తి సంగీత విభావరి'



భక్తిగీతాలు ఆలపిస్తున్న నాగరాజు తదితరులు

అనంతపురం కల్చరల్: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం రాత్రి జరిగిన భక్తి సంగీత విభావరి అమితంగా అలరించింది. ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాకుడు, సీనియర్ గాయకుడు పాలసముద్రం నాగరాజు నేతృత్వంలో వివిధ దేవతామూర్తులను స్మరిస్తూ ఆలపించిన వివిధ భక్తిగీతాలు అందరిని తన్మయులను చేశాయి. అదేవిధంగా కలవల నాగమణి ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో సాగింది. అనంతరం గాయనీ గాయకులను ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు సత్కరించారు. అంతకుముందు శ్రీదేవి బృందం గీతాలను ఆలపించింది.

సరుకులు, దుస్తుల పంపిణీ



చంద్రయాన్ సేవ సమితి ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేసిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: దసరా పండుగను పురస్కరించుకుని చంద్రయాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆజాద్‌నగర్, 6వ రోడ్డులో నివాసం ఉంటున్న పేద ప్రజలకు వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగస్ఘర్ రిజ్వాన్ నిత్యావసరాలు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా చంద్రయాన్ సేవా సమితి రంజాన్, బక్రీద్ పండుగలకు పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసేవారన్నారు. ఇప్పుడు పేద ప్రజల సౌకర్యార్థం సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ముున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో చంద్రయాన్ సేవా సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆదరణ సంస్థ నిర్వాహకులు లాల్‌బాషా, గరీబ్ క ఫర్డ్ ట్రస్టు హాజీ మసూద్ సాబ్, జిలాన్, జమైతే ఇస్లామీ హాజీవీరా, రెడ్‌క్రాస్ శర్మాస్, హిందీ పండిట్ రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో కొన్ని నెలలుగా మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. మట్కా ఆడిస్తున్న ఎం.కంబగిరి, ఎం.ప్రభావతి, కె.దస్తగిరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.27,100 నగదు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నారు.

రూ.లక్షలు వెచ్చించి..

నిరుపయోగంగా వదిలేసి

- ప్రారంభానికి నోచుకోని పశువైద్యశాల భవనం
- మూగజీవాలకు అందని వైద్యం
- ప్రజాధనం వృథా

కనగానపల్లి: మండల కేంద్రంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వైద్యశాల ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వంతో మూగజీవాలకు వైద్యం అందడం లేదు. ఈ భవనాలు వినియోగంలోని రాకనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మండల కేంద్రం కనగానపల్లిలో సుమారు రూ.23 లక్షలు వెచ్చించి పశు వైద్యశాల భవనం నిర్మించారు. గ్రామానికి సమీపంలో రాంపురం రహదారి పక్కన ఈ భవనం ఉంది. ఈ భవనానికి చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు పశువైద్యశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. అయితే ఈ భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభించ లేదు. వైద్యశాల ఆవరణలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో పాటు భవనానికి ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలు, గోడలు కూడా దెబ్బతిన్నాయి. భవనమే శిథిలావస్థకు చేరుకుంటోంది. ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చి పశువైద్య సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తే కనగానపల్లితో పాటు చుట్టు పక్కల ఉన్న రాంపురం, వరిమడుగు, పాలవాయి గ్రామాల పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అన్ని సౌకర్యాలు ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకుని రావాలని పశువైద్య సిబ్బంది కోరుతున్నారు.



పశువైద్యశాల భవనం ఆవరణలో పెరిగిన ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు

వెంటనే ప్రారంభించాలి

పాడి రైతుల కోసం రూ.లక్షల వెచ్చించి నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. దీంతో గ్రామం మధ్యలో ఉన్న పాత భవనం వద్దకే పశువులు, గొర్రెలను వైద్యం కోసం తీసుకుని వెళ్లాల్సి వస్తోంది. అయితే అక్కడ సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కొత్త భవనాన్ని త్వరగా ప్రారంభించి రైతులకు ఉపయోగపడేలా చూడాల్సిన అవసరం ఉంది.

– సంగప్ప, రైతు, యలకుంట్ల, కనగానపల్లి మండలం





పూజలందుకున్న శ్రీనివాసుడు , సర్వభూపాళ వాహనంపై అలంకార భూషితుడైనశ్రీవారు

కరుణించు.. వేంకటేశ్వర స్వామి

అనంతపురం కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాలు భక్తులను ఆనంద పరవశులను చేస్తున్నాయి. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతుడై సర్వభూపాళ వాహనంపై విహరించి దర్శనమిచ్చాడు. నగర వీధుల్లో పల్లకీ సేవ ముందు భక్తులు కోలాటం, భజన గీతాలతో హారతులు పట్టారు. అంతకు ముందు ఆలయంలో విశేష అభిషేకాలు, అలంకార సేవలతో పాటూ నవగ్రహ హోమం, దీక్షా హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు బారులుదీరి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు హరికిషోర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే రామనగర్, హౌసింగ్ బోర్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయాలలో బ్రహ్మోత్సవ వేడుకలు కమనీయంగా జరిగాయి.

సంతల ఆదాయం రూ.4.83 లక్షలు

అనంతపురం సెంట్రల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో శని, ఆదివారం జరిగిన పశువుల, జీవాల సంతల ద్వారా రూ.4.83 లక్షలు ఆదాయం వచ్చినట్లు సెక్రటరీ గోవిందు తెలిపారు. శనివారం జీవాల సంత ద్వారా రూ.2,70,540, ఆదివారం పశువుల సంత ద్వారా 2,13,300 వచ్చినట్లు వివరించారు.

మోసపూరిత హామీలతో చంద్రబాబు పాలన



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరిత హామీలతో రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ నాయకుడు రాంభూపాల్ మండిపడ్డారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో రెండో రోజు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలో రాకముందు అనేక హామీలు ఇచ్చారన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా 'అమ్మ ఒడి'ని 'తల్లికి వందనం' పేరుగా మార్చుచేసి తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే హామీలను పక్కనపెటి రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికే ప్రభుత్వ విద్య రోజురోజుకూ దూరం అవుతోందన్నారు. విద్యను బలోపేతం చేయాలంటే అందరూ కలిసి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే మెడికల్ విద్య నిర్వహించలేమంటూ సీఎం కేంద్రానికి లేఖ రాయడం దౌర్భాగ్యమన్నారు. చంద్రబాబు లేఖ వల్ల రాష్ట్రానికి రావాల్సిన 700 సీట్లు కోల్పోయామన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయాలని చూస్తున్నారన్నారు. వర్క్‌షాపులో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న కుమార్, అశోక్, ఉపాధ్యక్షులు పరమేష్, రామ్మోహన్, కిరణ్, వినోద్, వెంకటేశ్వర్లు, అబ్దుల్లా, రవి పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి



మాట్లాడుతున్న చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

అనంతపురం అర్బన్: చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈనెల 22న సంక్షేమ కార్పొరేషన్ల ఎదుట ధర్నా చేపడుతామన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన ముగుస్తున్నా సూపర్ సిక్స్ అమలు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారని తెలిపారు. 50 ఏళ్ల వయస్సు పైబడి అర్హులైన చేతివృత్తిదారులు, పేదలకు పింఛన్ అమలు చేయాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా అర్హులైన ప్రతి చేతివృత్తిదారుడికి 50 శాతం సబ్సిడీతో రూ.2 లక్షలకు తగ్గకుండా సొంత పూచికత్తుతో రుణం ఇవ్వాలన్నారు. చేతివృత్తిదారుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతం నిధులను ఉప ప్రణాళిక ద్వారా కేటాయించి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కల్లుగీత సొసైటీలకు 10 శాతం బ్రాందీ షాపులను కేటాయించాలని కోరుతూ ఈనెల 7,8 తేదీల్లో కలెక్టర్ కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, నాయకులు నాగప్ప, గోవిందరాజులు పాల్గొన్నారు.

సందేశం ఇచ్చే సినిమా 'రంగస్వామి'

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమ నేపథ్యంలో తీసిన సినిమా రంగస్వామి. ఇది మంచి సందేశం అందిస్తుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రంగస్వామి సినిమా పోస్టర్ విడుదల చేశారు. సినిమా విడుదల తేదీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువత మత్తుకు బానిసగా మారి ఎలా చెడిపోతున్నారో వివరిస్తూ ఈ సినిమా తీశారన్నారు. రామలసీమ నేపథ్యంలో కథనం ఉందన్నారు. చిన్న సినిమా అయినా ఇందులో చాలా మేసేజ్ ఉందన్నారు. రాయలసీమ ప్రజలు సినిమాను ఆదరించాలన్నారు. డైరెక్టర్ నరసింహా చారి మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంత నటులు హైదరాబాద్‌కు వెళ్లి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరిని దృష్టిలో పెట్టుకుని ఎన్ని ఇబ్బందులు వచ్చినా సినిమాను పూర్తి చేశామన్నారు. త్వరలో కొత్త నటీనటులతో రాయలసీమ నేపథ్యంలోనే మరో సినిమా తీస్తున్నట్లు వెల్లడించారు. అందులో కూడా కొత్త వారికి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నటులు దుర్గారావు, మారుతి సకారం, డాక్టర్ హరిప్రసాద్, రషీద్, మహిత, షేక్షా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కార మార్గం చూపాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య రాచపాలెం, తదితరులు

అనంతపురం కల్చరల్: సమాజంలో నెలకొన్న సమస్యలకు సాహిత్యం చక్కటి పరిష్కార మార్గం చూపాలని ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో డాక్టర్ వంకి రెడ్డి రెడ్డప్పరెడ్డి రచించిన చెరువు గండి, జననాయక జయహే నవలలు, గ్రేట్ డిక్‌లైన్ కథా సంపుటి పుస్తకాలను ఆవిష్కరించారు. ఏపీ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, బండి నారాయణ స్వామి, డాక్టర్ వైస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ, సీనియర్ రచయిత్రి నిర్మల రాణి హాజరయ్యారు. డాక్టర్ నాగేశ్వరాచారి, ప్రముఖ విమర్శకులు వేణుగోపాల్, డాక్టర్ పాదిలి నాగరాజు తదితరులు పుస్తకాల సమీక్ష చేసి వాటి ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రపంచీకరణ ఆర్థిక సరళీకరణ విధానాల వల్ల సంస్కృతి ఎలా విధ్వంసం చెందుతోందో వివరించారు. మార్కెట్ వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే కథలుగా ఇవి ఎంతో మందిని ఆలోచింపచేస్తాయని పేర్కొన్నారు. అందరూ చదవదగిన పుస్తకాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ నానీల నాగేంద్ర, గోసల నారాయణ స్వామి, జూటూరు షరీఫ్, టీవీరెడ్డి, రియాజుద్దీన్, హరినాథరెడ్డి, సడ్లపల్లి చిదంబర రెడ్డి, ఈరన్న, ఆచార్య శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యం



భగవద్గీత పుస్తకాలను అందిస్తున్న ధర్మప్రచార మండలి సభ్యులు

అనంతపురం కల్చరల్: నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యంగా హిందూ ధర్మప్రచార పరిషత్ పని చేస్తుందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక రామచంద్రా నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా ధర్మప్రచార మండలి వారు టీటీడీ ప్రత్యేకంగా పాఠశాల విద్యార్థుల కోసం తయారు చేసిన భగవద్గీత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మప్రచార మండలి అధ్యక్షుడు శ్రీపాద వేణు, ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు తదితరులు మాట్లాడారు. రెండు జిల్లాలోని అన్ని ప్రాంతాల వారికి ఉచితంగా భగవద్గీత పుస్తకాలు అందించామని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల్లో సృజనాత్మకతను ప్రోత్సహించి వారిలో నైతికత పెరిగేలా దోహదపడాలని సూచించారు. నేడు సమాజంలో అనేక రుగ్మతలకు భగవద్గీత చక్కటి పరిష్కారమార్గమని గీతా వ్యాప్తికి సహకరించాలని కోరారు. పుస్తకాలు కావాల్సిన వారు నేరుగా నగరంలోని టీటీడీ కల్యాణ మండపానికి వచ్చి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు ఆళ్లగడ్డ రాము, రేనాటి నాగేశ్వర రెడ్డి, శ్రీధరమూర్తి, లక్ష్మీరెడ్డితో పాటూ పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం..

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. అలాగే ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయంలోని భక్తులకు అన్నదానం చేశారు.

జగజ్జననికి జేజేలు



పాతూరు అమ్మవారి శాలలో శాకాంబరి అలంకరణ



కొత్తూరు అమ్మవారి శాలలో లలితత్రిపుర సుందరి దేవి అలంకరణ



వైష్ణవీ దేవి అలంకారంలో శారదా మాత



శంకర మఠంలో పూజలందుకున్న అమ్మవారు

అనంతపురం కల్చరల్: భక్తులను కరుణించే జగన్మాత శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఆదివారం పలుచోట్ల అమ్మవారు విభిన్న రూపాల్లో సాక్షాత్కరించి భక్తులను కటాక్షించారు. శివబాలయోగి ఆశ్రమంలో కంచి కామాక్షి దేవిగా అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని చెరుకు గడలతో భక్తులే స్వయంగా పూజించుకున్నారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో గరుడ వాహనంపై వైష్ణవీ దేవి, శంకరమఠంలో శారదా మాత పరమేశ్వరీగా అవతారంలో పూజలందుకున్నారు. కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాల్లో ప్రత్యేక పసుపు, కుంకుమ విశేష పుష్పాలంకారాల్లో దర్శనమిచ్చిన వాసవీ మాతను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తపోవనం వేదమాత గాయత్రి బాలాత్రిపుర సుందరిగా, హెచ్చెల్సీ కాలనీ వలీస్వామి ఆశ్రమంలో కొల్హాపూర్ మహాలక్ష్మీ లలితా త్రిపుర సుందరిగా పూజలందుకున్నారు. రెండవ రోడ్డులోని జ్ఞానపీఠం ఆధ్వర్యంలో సరస్వతీ రూపంలో అమ్మవారికి విశేష అలంకార సేవలు జరిగాయి. పల్లకీ సేవ, వివిధ హోమాలను పీఠం నిర్వాహకులు మధుసూధనరావు శాస్త్రోక్తంగా జరిపించారు. వందలాది మందికి అన్నప్రసాదాలు అందించారు. అలాగే ఐదో రోడ్డు సుంకులమ్మ, శివకోటి, మారుతీనగర్ కోదండ రామాలయం, హెచ్చెల్సీ కాలనీ నసనకోట ముత్యాలమ్మ ఆలయం తదితర చోట్ల అమ్మవార్లు ప్రత్యేక పూజలందుకున్నారు. సుభాష్ రోడ్డులోని లలితా అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులను అర్బన్ బ్యాంక్ చైర్మన్ మురళీధర్ నేతృత్వంలో సత్కరించారు.

లలితా త్రిపుర సుందరీ దేవిగా దుర్గాదేవి..

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయ నగర్‌లోని గౌరీ ప్రసన్నేశ్వర స్వామి దేవాలయంలో దేవి శరన్నవరాత్రులు కొనసాగుతున్నాయి. ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జీఎస్‌టీయూ రోడ్డులోని ముత్యాలమ్మ, ఇందిరమ్మ కాలనీలో ఐదో క్రాస్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో పూజలందుకున్నారు. రాప్తాడు శివాలయంలో పార్వతి దేవి, పెద్దమ్మ, మారెమ్మ, మరిగమ్మ, గంగలకుంట గ్రామంలో దుర్గాదేవి, బుక్కచెర్లలో నల్లలమ్మ దేవతలు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం ఆయా ఆలయాల్లో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: మండలంలోని ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆత్మకూరులోని వాసవీ మాత ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పి.యాలేరులోని పాతప్ప దేవాలయంలోని యల్లమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. వడ్డుపల్లిలోని సుంకులమ్మ అమ్మవారికి, పంపనూరులోని పార్వతి దేవికి పూజల అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.



బాలా త్రిపురసుందరిగా వేదమాత గాయత్రీ దేవి



వలీస్వామి ఆశ్రమంలో కొల్హాపూర్ మహాలక్ష్మి



అనంతేశ్వరి స్వామి ఆలయంలో కామాక్షి దేవి అలంకరణ



పి.యాలేరులో యల్లమ్మ తల్లికి ఆకుపూజ



ఆత్మకూరులో పూజలందుకున్న వాసవీ మాత



రాప్తాడు: లలితా త్రిపుర సుందరీ దేవిగా దుర్గాదేవి

అపూర్వ కలయిక.. ఆనందాల వేడుక



తగరకుంట జెడ్పీ పాఠశాలలో కలసిన పూర్వ విద్యార్థులు

కనగానపల్లి: 20 సంవత్సరాల క్రితం అంతా కలసి చదువుకొన్న వారంతా మళ్లీ ఒకచోట కలుసుకుని అప్పటి మధురానుభూతులను నెమరువేసుకున్నారు. మండలంలోని తగరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులంతా ఆదివారం స్థానిక పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను పిలిచి ఘనంగా సన్మానించారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాలకు తమవంతు సాయమందించాలని తీర్మానించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండటానికి అవసరమైన పాత్రల కోసం రూ.20 వేల సాయాన్ని స్కూల్ కమిటీ చైర్మన్ బ్రహ్మయ్యకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిరంజీవి, బసవరెడ్డి, హేమ, అరుణ, రాజ్యలక్ష్మి, నవీన్, సళ్లప్ప, పెద్దన్న, శ్రీనివాసులు, నాగార్జున, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.